క్లుప్తంగా

దరఖాస్తు గడువు పొడిగించాలి



మాట్లాడుతున్న అంజాద్ షరీఫ్

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమీ అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు సమయం పొడిగించాలని ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి అంజాద్ షరీఫ్ కోరారు. సోమవారం నంద్యాల పట్టణంలోని ఉర్దూ లైబ్రరీలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్‌అజీజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులు, ఉత్తమ ఉపాధ్యాయులు, ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి అవార్డులు ఇస్తుందన్నారు. అయితే, వీటికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25న చివరి రోజుగా ప్రకటించిందన్నారు. దసరా సెలవులు, పుస్తకాల పంపిణీ, ఎల్‌ఎఫ్‌ఎం శిక్షణ తరగతులు ఉండటం కారణంగా ఈనెల 31వరకు గడువు పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఫజులుర్ రెహమాన్, ఇబ్రహీం, ఫయాజ్, జమాల్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

వారిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో కోట్లాది రూపాయలు విలువ చేసే మున్సిపల్ స్థలాలను అక్రమంగా కబ్జా చేసుకున్న వారిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక సీపీఐ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ మున్సిపల్ స్థలాలను అక్రమంగా స్వాధీనం చేసుకొని కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాలను తప్పుడు సర్వేనెంబర్లు చూపించి వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారన్నారు.అయినా, మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడం లేదన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు రెండు ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి

నంద్యాల(సిటీ): మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)కు రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒకరు తమ స్థలాన్ని సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని, మరొకరు తమ గృహం వద్ద డ్రైనేజీ బ్లాక్ అవ్వడంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని అర్జీలు సమర్పించారు. డాక్టర్ అంకిరెడ్డి మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ఆయా సమస్యలను సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామన్నారు.

డీఎస్సీ కోచింగ్ ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సాయిరాంరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): బీసీ, మైనార్టీలకు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా డీఎస్సీ కోచింగ్ ఉచితంగా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాయలసీమ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీ, మైనార్టీ ఉన్నత వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వాలని అన్నారు.

ఉచిత బస్సు హామీ అమలు చేయాలి

నంద్యాల(అర్బన్): ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోస్టుకార్డు ఉద్యమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహాయాదవ్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోస్టుకార్డుపై మహిళా ప్రయాణికులతో సంతకాలు చేయించి వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పంపుతామన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, కో ఆర్డినేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్-6 హామీల్లో ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని, ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజు దగ్గరలో ఉందన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టర్ తన చాంబర్‌లో ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, డీఈఓ సుధాకర్ రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి తదితరులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ పథకం కింద వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు సర్వే చేపట్టామన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 24 తేదీలోపు పూర్తి కావాలన్నారు. ఈ ఏడాది నిర్దేశించిన 26,784 మంది నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు సంబంధిత వారికి ఉచిత విద్యాబోధన అందించేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద టీచర్లను గుర్తించాలన్నారు. ఐదేళ్ల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, సామాజిక కార్యకర్తలు భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, విద్యాశాఖ, పంచాయత్ రాజ్ శాఖల సమన్వయంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు.

శంకుస్థాపన చేసిన పనులు త్వరగా పూర్తి చేయండి

పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాల్లో శంకుస్థాపన చేసిన 1026 పనులను వచ్చే ఏడాది జనవరి 15లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు, పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు, స్వీప్, ఈ ఆఫీస్, రెవెన్యూ సదస్సులు, 200వందల రోజుల కార్యచరణ ప్రణాళిక, కోర్టు కేసులకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్‌ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని షెడ్యూల్ ప్రకారం ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా చదవాలన్నారు. వెబ్ ల్యాండ్ ప్రకారం కాకుండా సాగులో ఉన్న వ్యక్తుల పేర్లు మాత్రమే ఓటర్ల జాబితాలో పొందుపరచాలన్నారు. తాను ఆమోదం తెలిపిన ఫైళ్లకు సంబంధించి ప్రొసీడింగ్ ఉత్తర్వులు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. ఇకపై ఉత్తర్వులు జారీ చేయడం ఆలస్యం అయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ మాట్లాడుతూ రీ సర్వే చేసిన 173 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సర్వేకు సంబంధించిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలన్నారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల(సిటీ): జిల్లాలో జరుగుతున్న నేరాల నియంత్రణకు పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. సోమవారం స్థానిక ఎస్డీపీఓ కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సీసీఎస్(సెంట్రల్ క్రైమ్ స్టేషన్)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లకు సీసీఎస్ అనుసంధానం ఉంటుందన్నారు. నేరం జరిగినప్పుడు దర్యాప్తు సులభంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా దొంగతనాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, శాంతి భద్రతల పరిరక్షణ, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం తదితరాలు సీసీ కెమెరాల ద్వారా అనుసంధానం చేయడం ద్వారా నేరాలను అరికడతామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రమేష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): మత్తు పదార్థాలు- అనర్థాలు, మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ రమేష్‌కుమార్ సూచించారు. నేరాల నియంత్రణపై సోమవారం నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువజన సర్వీసులు, సెట్కూరు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి దీప్తి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచంలో మానవ అక్రమ రవాణా, క్రైమ్‌రేటులో మన దేశం మూడో స్థానం ఉందన్నారు. ప్రేమ పేరుతో అమ్మాయిలను వేరే ప్రదేశానికి తీసుకొని వెళ్లి అమ్మేయం జరుగుతుందన్నారు. మానవ అవయవాలు దొంగిలిస్తూ, చిన్న పిల్లలను ఎత్తుకెళ్లి భిక్షాటన చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలపై అధికమయ్యాయని, సైబర్ క్రైమ్‌నేరాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 1930, 112 టోల్‌ఫ్రీ నెంబర్ల ద్వారా ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణదాసు, వైస్ ప్రిన్సిపాల్ రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిలకు సోమవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు మహానంది, నంద్యాల టూటౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు మేరకు మహానంది మండలం గోపవరం గ్రామానికి చెందిన మండ్ల శ్రీరాం మనోజకుమార్ రోడ్డులో వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. దీనిపై బాధిత మహిళల ఫిర్యాదు మేరకు మహానంది పోలీసులు నిందుతుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచగా జడ్జి 2 రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామ శివారులోని సుగాలి మెట్టకు చెందిన నాగేంద్ర కుమార్ నంద్యాలలోని మహానంది రోడ్డులో మద్యం తాగి బైక్ నడుపుతుండగా ట్రాఫిక్ పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. తర్వాత నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జడ్జి 10 రోజులు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చిరువ్యాపారుల అభివృద్ధే లక్ష్యం

నంద్యాల(అర్బన్): చిరువ్యాపారుల ఆర్థికాభివృద్ధే తమ లక్ష్యమని చిరువ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఆకుమల్ల రహీం అన్నారు. స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన చిరువ్యాపారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ నూతన అధ్యక్షుడిగా ఆటోనగర్ వాసును కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. కోశాధికారి అన్వర్, కార్యదర్శి మదార్‌వలి పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం చూపాలి

దొర్నిపాడు: ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీఓ సావిత్రి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. వసతిగృహ సంక్షేమశాఖ అధికారి రాముడు, డీటీ మాధవ్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

దొర్నిపాడు: వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. సోమవారం ఆయన దొర్నిపాడు శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సీడ్‌పత్తి క్రాసింగ్ పనులకు ఆటోలలో పరిమతికి మించి కూలీలను ఎక్కించుకొని వెళ్తున్నారన్నారు. ఎదైనా ప్రమాదం జరిగితే నిండుప్రాణాలు పోతాయన్నారు. ఇటీవల డబ్ల్యూ గోవిందిన్నె వద్ద జరిగిన ప్రమాదంలో మహిళా కూలీ మృతి చెందిన ఘటనను గుర్తు చేశారు. వాహనాలకు సంబధించి ఆర్సీ, లైసెన్స్ తప్పని సరిగా వద్ద ఉండాలన్నారు.

ఎన్‌సీసీతో ఉపాధి అవకాశాలు

శిరివెళ్ల: ఎన్‌సీసీలో చేరి ఉద్యోగ అవకాశాలను పొందాలని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జనార్దనుడు అన్నారు. కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో యూనిట్ ప్రారంభమయ్యిందన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉంటే ఉన్నత విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఉంటాయన్నారు. ప్రస్తుతం యూనిట్‌లో 20 మంది బాలురు చేరారన్నారన్నారు. యూనిట్‌లో 50 మంది వరకు చేరవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఖాసీం సాహెబ్ పాల్గొన్నారు.

దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

నంద్యాల(అర్బన్): చిన్నారులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ అన్నారు. రాష్ట్రంలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై ముస్లిం మైనార్టీ సంఘాలతో దశల వారీ ఉద్యమాలు చేపడుతామన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు ఇటీవల కడప జిల్లా బద్వేల్‌లో మైనార్టీ వర్గానికి చెందిన షేక్ దస్తగిరమ్మను కిరాతకంగా హత మార్చిన విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలన్నారు.

విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి కృషి

- ఏపీఈఆర్‌సీ చైర్మన్ నాగార్జున రెడ్డి



కర్నూలు న్యూసిటీ: విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి అన్నారు. నగర శివారులోని విద్యుత్ నియంత్రణ మండలి కర్నూలు కార్యాలయంలో సోమవారం 10వ రాష్ట్ర విద్యుత్ సమన్వయ ఫోరం సమావేశాన్ని చైర్మన్ జస్టిస్ నాగార్జునరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 2024–25 నుంచి 2028–29 వరకు అమలు చేయనున్న విద్యుత్ ప్రణాళికపై చర్చ జరిగింది. రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ రాష్ట్ర విద్యుత్ ప్రణాళికను, ముఖ్య ఉద్దేశాలు, లక్ష్యాలను కమిటీకి వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలోని ముఖ్య అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని అవసరమైన మార్పులు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రణాళికపై కొత్త సమీకృత స్వచ్ఛ ఇంధన పాలసీ ప్రభావం ఉంటుందని, దీంతో ప్రస్తుత ప్రణాళికను పున:సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే విద్యుత్ పరికరాల అంచనా వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని అదుపు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో విద్యుత్ నియంత్రణ మండలి తరఫున ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. సంస్థల సీఎండీలు రవి పట్టాన్‌శెట్టి, సంతోషరావు, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న అర్చకులు

మహానంది: మహానందిలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, పండితులు, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

భక్తిశ్రద్ధలతో రుద్ర, చండీ హోమాలు

మహానంది ఆలయంలో సోమవారం రుద్ర, చండీ హోమాలు వైభవంగా నిర్వహించారు. రవిశంకర్ అవధాని, ఆంజనేయ శర్మ, హనుమంత శర్మ ఆధ్వర్యంలో స్థానిక యాగశాలలో పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించిన అనంతరం ప్రత్యక్ష, పరోక్ష సేవలో పాల్గొన్న భక్తుల ఆధ్వర్యంలో హోమాలు చేపట్టారు.

కొనసాగుతున్న రద్దీ

మహానంది ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సోమవారం ఈశ్వరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చారు. శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి కనిపించింది.

ఊపందుకున్న సీడ్ పత్తి క్రాసింగ్ పనులు



బుర్రారెడ్డిపల్లెలో సీడ్ పత్తి క్రాసింగ్ పనులు చేస్తున్న మహిళలు

దొర్నిపాడు: వారం రోజుల విరామం అనంతరం మండలంలో సీడ్ పత్తి క్రాసింగ్ పనులు ఊపందుకున్నాయి. దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, చాకరాజువేముల, డబ్ల్యూకొత్తపల్లె, రామచంద్రాపురం, డబ్ల్యూ గోవిందిన్నె, క్రిష్టిపాడు గ్రామాల్లో సీడ్‌పత్తిని అధికంగా సాగుచేశారు. తుపాను కారణంగా రైతులకు నష్టాలు జరగగా పనులకు అంతరాయం కలగడంతో కూలీలు కూడా ఉపాధి కోల్పోయారు. ప్రస్తుతం వర్షాలు తగ్గి ఎల్లడి ఇవ్వడంతో క్రాసింగ్ పనులు జోరందుకున్నాయి.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

గోస్పాడు/నంద్యాల(అర్బన్): గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షేక్ మొహిద్దీన్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేలో సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 22 నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22న జిల్లెల్ల, 23న కానాలపల్లె, 24న ఎం. చింతకుంట్ల, 25న ఎం.కృష్ణాపురం, 26న పసురపాడు, 29న రాయపాడు, 30న ఎస్. నాగులవరం, వచ్చే నెల 1న సాంబవరం, 2న తెళ్లపురి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు .

నంద్యాల మండలంలో

ఈనెల 22 నుంచి వచ్చే 12వ తేదీ వరకు నంద్యాల మండల గ్రామాల్లో భూముల రీ సర్వేకు సంబంధించిన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రియదర్శిని తెలిపారు. 22న అయ్యలూరు, 23న బిల్లలాపురం, 24న చాబోలు, 25న చాపిరేవుల, 26న గుంతనాల, 29న పెద్దకొట్టాల, 30 మిట్నాల, నవంబర్ 1వ తేదీ మునగాల, 2న పోలూరు, 5న పుసులూరు, 6న రాయమాల్పురం, 7న ఊడుమాల్పురం, 8న బ్రాహ్మణపల్లె, 12న పులిమద్ది గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

ఉయ్యాలవాడ : మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 22న గోవిందపల్లె, 23న ఇంజేడు, 24న కాకరవాడ, 25న కొండుపల్లె, 26న నర్సిపల్లె, 29న ఆర్.జంబులదిన్నె, 30న రూపనగుడి, నవంబర్ 1న సుద్దమల్ల, 2న వెంగంపల్లె గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పై గ్రామాల్లో ఇప్పటికే నిర్వహించిన భూముల రీ సర్వేకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే గ్రామసభల్లో అర్జీలు సమర్పిస్తే పరిష్కరిస్తామన్నారు.

దొర్నిపాడు మండలంలో..

దొర్నిపాడు: మండలంలో మంగళవారం నుంచి భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్ర సోమవారం తెలిపారు. 22న బుర్రారెడ్డిరెడ్డిపల్లె, 23న గుండుపాపల, 24న కొండాపురం, 25న క్రిష్టిపాడు, 26న డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మార్పీ కే మందులు విక్రయించాలి



ఎరువుల దుకాణంలో మందులను పరిశీలిస్తున్న ఏఓ

ఉయ్యాలవాడ : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పురుగు మందులను రైతులకు విక్రయించాలని ఏఓ సుధాకర్‌రెడ్డి డీలర్లకు సూచించారు. సోమవారం మండలంలోని మాయలూరు గ్రామంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏఓ మాట్లాడుతూ ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు లేకుండా నాణ్యమైన మందులను రైతులకు అందజేయాలని సూచించారు. నిర్ణీత ధరల కన్నా అధిక రేటుకు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెగుళ్లతో అప్రమత్తంగా ఉండండి

తుపాన్ ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురిశాయని, పొగాకు, కంది, పత్తి, మిరప, తదితర పంటలకు వేరు తెగుళ్లు ఆశించే ప్రమాదం వుందని ఏఓ తెలిపారు. నీటి నిల్వలు లేకుండా పొలాల్లో నుంచి బయటకు పంపాలన్నారు. నివారణ చర్యల్లో భాగంగా ఎకరాకు 19–19–19 లీటర్ నీటిలో 5 గ్రాములు కలిపి లేదా ఫార్ములా–07 మందు ఒక లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పంటపై పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

సాధనతో క్రీడల్లో రాణింపు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): సాధనద్వారానే క్రీడల్లో రాణించగలుగుతారని జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు రవికృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్ అన్నారు. జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని క్రాంతినగర్ శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను వారు అభినందించి మాట్లాడారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ర్యాపిడ్ విభాగంలో నంద్యాల జిల్లాకు చెందిన హర్షవర్ధన్ మొదటి స్థానం, ఆళ్లగడ్డకు చెందిన యుగంధర్ రెండోస్థానం, బ్లిట్జ్ విభాగంలో నంద్యాలకు చెందిన కాలీమ్, మణికుమార్ మొదటిస్థానం, హర్షవర్ధన్ రెండో స్థానం సాధించి నంద్యాల జిల్లా తరఫున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, వైద్యులు మహేశ్వరరెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు రవిశంకర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులేసు పాల్గొన్నారు.

రైతుకు అపార నష్టం



రుద్రవరం సమీపంలో దెబ్బతిన్న కాకర పంట

రుద్రవరం: మండలంలో 10రోజుల నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో వర్షం నీరు పంట పొలాల్లో నిలిచి రైతులకు అపార నష్టం కలుగుతోంది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు ఖరీఫ్, రబీ కింద వరి,మినుము,మొక్క జొన్న, జొన్న, మిర్చి, పత్తి, కంది, బంతి పూలు, పసుపు, బొప్పాయి తదితర పంటలు సాగు చేశారు. ఆయా పంటల దిగుబడులు చేతికొచ్చే సమయంలో వర్షాలు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కేఎంసీలో ర్యాగింగ్ కలకలం!

- మీసాలు, గెడ్డాలు పెంచుకోవద్దు... బూట్లు వేసుకోవద్దు
- మేం చెప్పిన యాప్‌లే డౌన్‌లోడ్ చేసుకోవాలి
- జూనియర్లను వేధిస్తున్న సీనియర్లు



కర్నూలు మెడికల్ కాలేజీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం సృష్టించింది. ఇటీవల కళాశాలలో చేరిన జూనియర్ (ఫ్రెషర్స్)ను సీనియర్లు వేధించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని బాధిత విద్యార్థులు కొందరు తమ తల్లిదండ్రుల ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. దీనిపై అధికారులు అంతర్గతంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కర్నూలు మెడికల్ కాలేజీలో ఈ నెల 14వ తేదీ నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. తరగతి గదుల్లోకి కొందరు సీనియర్ విద్యార్థులు గుంపులుగా వచ్చి ర్యాగింగ్ చేస్తున్నట్లు సమాచారం. 'జూనియర్ విద్యార్థులు బూట్లు వేసుకురాకూడదు. మీసాలు, గెడ్డాలు పెంచుకోవద్దు. మేం చెప్పిన యాప్‌లనే స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. మేము చెప్పినట్లు నడుచుకోవాలి...' అని వివిధ రకాలుగా బెదిరించినట్లు తెలిసింది. కళాశాలలోని హాస్టల్‌లో సైతం మెస్‌కు వెళ్లి తమకు భోజనం తీసుకురావాలని, ప్లేట్లు కడగాలని హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. కొందరు సీనియర్ వైద్య విద్యార్థులు హాస్టల్‌లోనే సిగరెట్లు, మద్యం తాగుతున్నారని తెలిసింది. ఈ విషయాలపై విచారణ చేసేందుకు అధికారులు హాస్టల్ గేటు వద్దకు వెళ్లగానే వారికి సమాచారం అందుతుందని, అప్రమత్తం అవుతున్నారని తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ఆళ్లగడ్డ: మండల పరిధిలోని పేరాయిపల్లె మెట్ట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు గాయపడ్డారు. గుంటూరుకు చెందిన సాయి వెంకటేష్ కారులో కుటుంబ సభ్యులతో కలిసి మహానంది క్షేత్రం చేరుకుని దర్శనం చేసుకున్న అనంతరం తిరుమలకు బయలు దేరారు. పేరాయిపల్లె మెట్ట సమీపంలో టైర్ పగిలిపోవడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో సాయివెంకటేష్‌తోపాటు రమాదేవి, జాహ్నవి, సుధీర్, శశి గాయపడ్డారు. క్షతగాత్రులను నంద్యాల వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.